


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

63

(8 ఫిబ్రవరి 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**దేశంలో హాస్యం** అంటే అపహాస్యం ఎక్కువైపోయింది. అపహాస్యానికి అసందర్భాలు, ఆర్భాటాలు, ఆలంబనవుతాయి. హాస్యానికి సంస్కారపూరితమైన సునిశిత విమర్శ ఆలంబన. నిజమే.. అపహాస్యం పెచ్చుపెరిగిపోయినమాట.

***తమాషా నాట్యాలు - తైతక్కలు***

చాలామంది ప్రబుద్ధులు తాము అపహాస్యం పాలవుతున్నామని తెలిసికూడా ఆ విషయం పట్టించుకోరు. దానిచుట్టూ స్వార్ధమనే పరదాలు చుట్టి తమచుట్టూ ప్రాపకం, అధికారం, దర్పమనే జలతారు తెరలు దించుకుని తమాషా నాట్యం చేస్తూ ఉంటారు. వాటినే తైతక్కలంటారు.

తిని కూర్చోలేక, తీరి మనుగడ సాగించలేక చాలామంది అపహాస్యానికిపాలవుతూ ఉంటారు. ఇలాటివారు అన్ని రంగాలలో అవతరిస్తూ ఉంటారు. ఎక్కడనుంచో అక్కడ నుంచి వారి నెత్తిన ఇన్ని అక్షింతలు పడుతూ ఉంటాయి. ఆ తల తనది కాదన్నట్లు - తిరిగి అదే విధంగా వారు బయలుదేరుతూ ఉండాలి. అదోరకం కర్మ.

కొందరు బయటికి బయలుదేరారంటే చాలు. ఇంటికి మామూలుగా తిరిగి రారు. జుట్టు దులుపుకుంటూ, గుండెలు రాచుకుంటూ రావలసిందే "ఎందుకొచ్చిన గొడవయ్యా.. సంబంధంలేని విషయాలలో తల దూరుస్తావు? చేసేది తప్పని తెలిసికూడా అలా తప్పెట భుజాన వేసుకుని బయలుదేరతావు" అంటే వింటారా? సలహా చెప్పేవాళ్ళను చవటల క్రింద జమకట్టి, విసుగుతో వారిని వెనక్కు నెట్టి తన ప్రతాపం వెలగబెట్టడానికి బయలుదేరుతూ ఉంటారిలాంటివారు. శృంగభంగమైనా - సూదిమొన గ్రుచ్చుకున్నంత బాధ అయినా పడకుండా సూటిగా తమ దారిన తాము పోతూ ఉంటారు. 'ఆ బ్రతుకు అంతే' అనిపించుకుంటారు.

మా ఊళ్ళో ఒక బ్రాహ్మణుడుండేవాడు. ప్రొద్దునలేచి స్నానం చేసి, సంధ్యావందనం చేసుకుని వచ్చి ఎవరి అరుగుమీదో కూర్చునేవాడు. ఆయన భార్య చెరువుకి స్నానానికి వెడుతూ, "ఇంటికి వస్తారా! పిల్లవాడు ఏడుస్తున్నాడు" అని ఏదో నెపం మీద పిలుచుకు వెళ్ళాలని ప్రయత్నించేది. "ఏడిస్తే ఏడవనీ నేనిప్పుడే రాను" అని ఆయన అక్కడే కూర్చునేవాడు.

మధ్యాహ్నం పన్నెండుగంటలయ్యే లోపల దారినిపొయ్యేవాణ్ణి ఎవణ్ణో పిలిచి ఒకణ్ణి హేళన చెయ్యాలి. వాడు ఎదురుతిరిగి గట్టిగా తిట్టాలి. అవసరమైతే ఒక చెంపకాయ కొట్టాలి. అప్పుడుగాని భోజనానికి వెళ్ళడం పడేదికాదు. అవతలవాణ్ణి తిడుతూ అవుపోసనం పట్టడం జరిగేది. ఆవిడ ఎంతబాగా వంటచేసినా ఆవిణ్ణి దుమ్మెత్తిపోస్తూ గాని తినడం పడేదికాదా భూసురోత్తముడికి.

***శృంగభంగానికి రంగస్థలం...***

ఆ గ్రామంలో ఎంతో అపహాస్యం పాలయిపోయాడు. ప్రతివాడూ ఆయన్ని చూచి తప్పుకొనేవారు. ఎదురొస్తే బెదిరిపోయేవారు. ఆయన అదంతా తనకు గల ప్రతిష్ఠ అనుకునేవాడు. ప్రతిరోజూ ఒక ఇంటి అరుగు ఆయన శృంగభంగానికి రంగస్థలమయ్యేది.

అలా రోజుకి ఒకరి చేతికి అక్షింతల పళ్ళెం అందించి – తలవంచి నిలబడి, వాటితో నింపుకోవడం, దులుపుకుంటూ ఇంటికి పోవడం ఆయన జీవిత క్రమంగా మారిపోయింది. మానవతనే మరచిన మహనీయుడు.

చాలామంది హోదాలలో ఉండి, న్యాయంగా కాలం గడిపితే బాగుండదని ఏవో అన్యాయాలు చేస్తూ, మానవతను మరచి వ్యవహరిస్తూ – అశేష జనం చేత అక్షింతలు వేయించుకుంటారు. ఆ దుబ్బుజుట్టు ఎన్నింటినైనా భరిస్తుంది. ఆ దిబ్బ ముఖం ఎంత అపహాస్యాన్నయినా సహిస్తుంది.

చెయ్యరాని పనులు చెయ్యడం వల్ల, అక్కర లేని ప్రసక్తిలోకి దిగడంవల్లా, ఆర్భాటాలకు పోవడంవల్లా, శక్తిని మించిన పనులు తలపెట్టడంవల్లా, పరులను వంచించడానికి ప్రయత్నించడం వల్లా – నరులు అపహాస్యంపాలు అవుతూ ఉంటారు.

మునిసిపాలిటీ ఎన్నికలలో పాల్గొని ముప్పతిప్పలకు లోనై చివరకు గెలుపు సాధించలేకపోయిన ఒక వ్యక్తి ఎకాఎకిని అసెంబ్లీకి దరఖాస్తు పడేసి, ఏడాది సంసారపు ఖర్చులకు సరిపోయే డబ్బు ఢిల్లీలో గ్రుమ్మరించి రావడానికి సాహసించాడంటే – అక్షింతలు నెత్తిన వేసుకుని చక్కా వచ్చాడంటే అపహాస్యంకాక ఏమవుతుంది?

***మాడున పసుపు అలాగే ఉంది***

ఇలా అక్షింతలు వేయించుకున్న పెద్దమనిషి ఒకాయన మొన్న మా ఇంటికి వచ్చాడు. బియ్యపు గింజలు జారిపోయినా మాడున పసుపు ఇంకా అలాగే ఉంది. వచ్చినప్పటినుంచీ తన విషాదగాథ వర్ణించడం ప్రారంభించాడు. తాను అభ్యర్థిగా నిలవాలనుకున్నాడట. కాంగ్రెసు టిక్కెట్టుమీద ఖద్దరు చిన్నప్పటి నుంచీ ధరించటం ఒక్కటి తప్ప వేరే అర్హత ఏమీ ఉన్నట్లు లేదు. కాకపోతే ఏ పురుషుణ్ణి పలకరించినా దేశభక్తి పుక్కిలింతలుగదా! దేశాన్ని బాగుచెయ్యాలనే ఆకాంక్ష అపరిమితంకదా! తక్కినవాళ్ళ కంటే తను పదింతలు గొప్పవాణ్ణనే భావం ఉండటం సర్వసామాన్యంగదా!

అన్నింటినీ మించి దేశమాత చేతులు జాచి "నాయనా! వినాయకరావూ నన్నిలా వదిలి ఊరుకున్నావా! నువ్వు తలుచుకుంటే నన్ను ఉద్ధరించడం ఒక గొప్పా వినాయకరావూ ! అమ్మమీద ఎందుకింత ఉదాసీనత వహించావు. నే చేసిన తప్పేమిటి పుత్రరత్నమా. కోపం వద్దు. రా తండ్రీ నన్ను ఉద్ధరించు. నన్ను సేవించు. నీ అంతటివాడు అలా దూరంగా ఉంటే నాకెంత విచారంగా ఉంటుందో యోచించు" అని పిలుస్తున్నట్లు ప్రతివాడూ ఈ రోజుల్లో కలలు కంటూనే ఉంటాడాయె.

***వయస్సుకాదు.. ప్రజా శ్రేయస్సు ముఖ్యం.***

ఇలాటి అర్హతలతోనే పైన చెప్పిన పెద్ద మనిషి పోటీకి నిలవాలని దరఖాస్తు పెట్టారు. ఖద్దరు టోపీ, పల్లెవాటులతో ఢిల్లీకి చేరాడు. చెయ్యవలసినవాళ్ళందరి దర్శనం చేశాడు. తన స్వీయ ప్రణాళికలో గల ప్రగతి పథాన్ని వారికి తెలియపరిచాడు. "వయస్సు పాటించకండి – ప్రజాశ్రేయస్సు దృష్ట్యా నా అర్జీ చిత్తగించండి" అని చెప్పుకున్నాడు.

కానీ, ఆయనలోగల ప్రతిభను గుర్తించే శక్తి వారికి లేకపోయినట్లుంది. "మీమీద మాకెంతో గౌరవం ఉంది. కానీ, సీటు ఖాళీలేదు. బయట నుంచే భారతమాతను సేవించండి" అన్నారట.

ఆయనగారికి ఎంతో చిన్నతనం వేసింది. విన్నపం ఆలకించలేకపోయారే అన్న కోపం వచ్చింది. తను పట్టుకు వెళ్ళిన ప్రణాళికను జాగ్రత్తగా వెనుకకు తెచ్చుకున్నాడు. తన స్వగ్రామం చేరబోతూ ఇక్కడ మకాం వేశాడు.

"ప్రణాళికను పాదుకులుగా మోసుకువచ్చాను వెనక్కు. దీన్ని దగ్గర ఉంచుకుని మా ఊరునే నంది గ్రామం చేసుకుని, దేశ సేవచేస్తాను. కనీసం మా గ్రామాన్నయినా రామరాజ్యం చేస్తాను. ఇదీ నా శపథం. నన్ను ఎన్నుకుంటే అందరి వద్దకు ఓట్ల కోసం నేను వెళ్ళవలసి వచ్చేది. ఇప్పుడు సలహాలకు అందరూ నా దగ్గరకే వస్తారు. ఓట్లకు నిలబడటమంటే స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకోవడమే" అని మనస్సుకు సమాధానం చెప్పుకున్నాడు.

***సీటు ఇస్తే అసెంబ్లీలో చోటు ఖాయం.***

కాని, ప్రాణం ఒప్పక ఆ రాత్రంతా కూర్చుని ఒక అప్పీలు వ్రాశారు. తెల్లారి టైపు చేయించారు. రెండు మూడు రూపాయలు పెట్టి రిజిష్టరు పోష్టులో పంపించారు. అక్కడికి గానీ కసితీరలేదాయనకు. "చెయ్యాల్సింది చేశాం. వస్తా.. వారం రోజుల్లో గిర్రున తిరిగి రావాలి సీటు. సీటు వస్తే అసెంబ్లీలో చోటు వచ్చినట్లే. మన పేరు చెపితో పిచ్చినోట్లు ఎక్కడ పడితే అక్కడే ఆ సంగతి హైకమాండుకు తెలియదు" అన్నాడు అతిగర్వంగా.

ఆ మధ్యాహ్నం బయలుదేరి వెళ్ళాడు! స్వగ్రామానికి ఇలా ఎంతమంది అసలు విషయాలు ఆలోచించకుండా సీట్లకోసం ఎగబడుతున్నారో? అనవసరంగా అపహాస్యం పాలవుతున్నారో? ఈ ఎన్నికల తిరణాలలో చాలామంది గుండెలు సన్నికల్లురాళ్ళుగా మారిపోతాయి పాపం.

●●●

Post your comments